

సభాపతి బసవరాజహొరట్టికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ సభ్యులు

# హక్కులు హరించారు..

- పరిషత్‌లో సభ్యుల ప్రవర్తన హేయం
- మంత్రి హెబ్బాళ్కర్ అనుచరులు దాడులు చేశారు
- చర్యలు తీసుకోవాలని బీజేపీ సభ్యుల ఫిర్యాదు
- నేటి సాహిత్య సమ్మేళనానికి సీటీ రవి రాక డౌటే

బెంగళూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాల చివరిరోజు గురువారం చోటు చేసుకున్న సంఘటనపై విధానపరిషత్ సభ్యులకు హక్కుల ఉల్లంఘన జరిగిందని, సమగ్ర విచారణ జరిపించాలని సభాపతి బసవరాజహొరట్టికి బీజేపీ సభ్యులు రవికుమార్, డీఎస్ అరుణ్‌లు వినతిని సమర్పించారు. శుక్రవారం రాత్రి హుబ్బళ్ళిలోని హొరట్టి నివాసానికి వెళ్లి విన్నవించారు. కలాపాలు ముగిశాక చోటు చేసుకున్న సంఘటనలపై విచారం వ్యక్తం చేశారు. పరిషత్‌లో సభ్యులు ప్రవర్తించిన తీరును వివరించారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఆప్తసహాయకుడితోపాటు కొందరు రౌడీల్లా వ్యవహరించారని, సభ్యుడు సీటీ రవిని తీసుకుని వెళ్లార న్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతోపాటు రాత్రంతా ఆరేడు పోలీస్‌స్టేష న్‌లకు సీటీ రవిని తిప్పారని హొరట్టికి వివరించారు. ఎఫ్ఐఆర్ కూడా లేకుం డానే పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.

### వీడియోలు, ఆడియోలు ఉంటే పరిశీలిస్తాం: సభాపతి

పరిషత్‌లో సభ్యుడు సీటీ రవి, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్య లపై రికార్డులు నమోదు కాలేదని సభాపతి బసవరాజహొరట్టి తెలిపిన విషయం సముచితమే. అయితే కాంగ్రెస్ సభ్యులు, మంత్రి డీకే శివకుమార్ ఆధారాలు ఉన్నాయని తెలపడంతోపాటు వివిధ ఛానళ్లలో ప్రసారం అవుతున్న తరుణంలో మరోసారి పరిశీలిస్తానన్నారు. అంతమాత్రాన మునిగిపోయిందేమీ లేదని మరోసారి పరిశీలించి, అనుచితమైన వ్యాఖ్యలు ఉంటే చర్యలు తీసుకుం టామన్నారు.

### రవీ.. రావద్దు..

మండ్యలో జరుగుతున్న సాహిత్య సమ్మేళనంలో చివరిరోజైన ఆదివారం రాజ కీయ అంశాలపై సీటీ రవి చర్చాగోష్టిలో పాల్గొనాల్సి ఉంది. రెండు రోజులుగా సాగుతున్న పరిణామాలతో శనివారం పలువురు 'సీటీ రవి గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. మహిళా వ్యతిరేకి, రాజ్యాంగ వ్యతిరేకికి సమ్మేళనంలో పాల్గొనడానికి అర్హత లేదని నినాదాలు చేశారు. సీటీ రవి వస్తే అడ్డుకుంటా మని హెచ్చరించారు. దీంతో ఆయన రాకపోవచ్చని భావిస్తున్నారు.





# మృత్యుఘోష..!



చంద్రయాగప్ప కుటుంబం (ఫైల్)

- రాష్ట్రంలో రక్తమోడిన రహదారులు
- కారుపై కంటైనర్ పడి ఆరుగురి దుర్మరణం
- మండ్య జిల్లాలో రెండు ప్రమాదాలు
- ముగ్గురు విద్యార్థులు.. ఇద్దరు మహిళల మృత్యువాత

రహదారిపై మృత్యుఘోష ప్రతిధ్వనించింది. శనివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 11 మంది కన్నుమూశారు. బెంగళూరు శివారు ప్రాంతం నెలమంగల సమీపంలోని టి బేగూరు వద్ద జాతీయ రహదారిపై కారుపై కంటైనర్ బోల్తా పడి సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ కుటుంబం దుర్మరణం పాలయ్యింది. క్రిస్మస్ వేడుకలకు సొంత రాష్ట్రం వెళ్తుండగా మృత్యువు వారిని బలిగొంది. మండ్య జిల్లాలో విహారయాత్రకు వెళ్లిన విద్యార్థుల కారు ప్రమాదానికి గురై ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. బెంగళూరులో చదువుతున్న ఐఐటీ విద్యార్థులు వారాంతం కావడంతో కొడగు జిల్లా తలకావేరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మహదేశ్వరపుర వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. ప్రమాదాలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



ప్రమాదానికి గురైన విద్యార్థుల కారు

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకే రోజున కొన్ని గంటల వ్యవధిలో రహదారులు రక్తమోడాయి. సరదాగా మిత్రులతో గడిపేందుకు వెళ్తున్న నలుగురు విద్యార్థులు ప్రమాదానికి గురి కాగా ముగ్గురు దుర్మరణం చెందారు. మండ్య జిల్లాలో ఈ ప్రమాదం చోటు చేసుకోగా ఇదే జిల్లాలో మేలుకోటె పరిధిలో తిరుపతికి వెళ్లేందుకు బస్టాండ్‌కు డ్రాప్ చేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇద్దరు మృతి చెందారు. నెలమంగల వద్ద జాతీయ రహదారిపై ఘోరమైన ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళ్తున్న ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి కంటైనర్ డ్రైవర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ మార్గంతో వీరికి సంబంధం లేకున్నా ఎదురుగా డివైడర్‌కు అవతలివైపు వస్తున్న కారుపై కంటైనర్ బోల్తాపడ్డంతో ఎన్నో ఆశలు, ఆలోచనలతో జీవిస్తున్న కుటుంబం క్షణాలలో గాలిలో కలిసిపోయారు.

### ఐటీ కంపెనీతో ఎందరికో ఉద్యోగాలు

మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా జత్తా తాలూకా మోరబగి గ్రామంలో జన్మించిన చంద్రశేఖర ఎగప్పగోళ అలియాస్ చంద్రయాగప్ప ప్రాథమిక దశనుంచే విద్యలో చురుగ్గా ఉండేవాడు. సూరత్కల్ ఎన్ఐటిలో ఇంజనీరింగ్ చేశారు. విదేశాలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొనసాగారు. ఎంత కాలం విదేశాలలో ఉండాలని సొంతదేశంలో ఉండి పదిమందికి ఆదర్శం కావాలని భావించి బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ఐఏఎస్‌టీ పేరిట సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారు. ఎండీ, సీఈఓగా సుమారు వందలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. వివిధ విభాగాలలో ఎక్స్‌పోర్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండు నెలలక్రితం పిల్లలు ఇష్టపడుతున్నారని విలాసవంతమైన కారును కొనుగోలు చేశారు. క్రిస్మస్ సెలవులలో భాగంగా కుటుంబీకులతో సరదాగా గడపాలని భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకుతో కలసి శనివారం బయల్దేరారు. చంద్రయాగప్ప సోదరుడు మల్లికార్జున యాగప్ప బెంగళూరులో డాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇలా సోదరుడి భార్య విజయలక్ష్మితో పాటు చంద్రయాగప్ప భార్య గౌరిబాయి, కుమారుడు ధ్యాన్, కుమార్తెలు దీక్షా, ఆర్యలతో కలసి వెళ్తుండగా కంటైనర్ వీరి వెళ్తున్న కారుపై బోల్తాపడ్డంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం చేసిన కంటైనర్ డ్రైవర్ ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. ప్రమాద వివరాలను మీడియాకు వివరించాడు. ముందు వెళ్తున్న కారుకు ప్రమాదం జరగకూడదనే ప్రయత్నంలోనే ఘోరం జరిగిందన్నారు. సంతోషంగా గడుపుతున్న కుటుంబం మృత్యువుకు బలి అయ్యింది.

### విహారయాత్రలో విషాదం..!

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా మళవళ్లి తాలూకా బోసగౌడనదొడ్డి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు. బెంగళూరు ఐఐటీ కళాశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థుల కొడుగు జిల్లా తలకావేరితో పాటు మడికేరి ప్రాంతాల సందర్శనకు బయలుదేరారు. జాతీయ రహదారి 209పై కేఎస్ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ప్రణవ్, ఆకాశ్, ఆదర్శ్ అనే ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి పృథ్వీ తీవ్రంగా గాయపడ్డారు. మళవళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రగాయాల పాలైన పృథ్వీని ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు.

### ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని ఇద్దరు మహిళల దుర్మరణం

- మండ్య జిల్లా మహదేశ్వరపుర వద్ద ప్రమాదం
- బస్టాండ్‌లో డ్రాప్ చేసేందుకు వెళ్తుండగా..

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. మరో యువతి తీవ్రంగా గాయపడ్డారు మండ్య జిల్లా మహదేశ్వరపుర వద్ద ప్రమాదం జరిగింది. మైసూరు - జీవర్గి రహదారిపై ప్రమాదం జరిగింది. తిరుపతికి వెళ్లాలనుకున్న ఇద్దరిని బస్టాండ్‌కు వదిలేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ముగ్గురు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని సంధ్యా(19), శిల్ప(35) దుర్మరణం చెందారు. ప్రమాదంలో శైలజ తీవ్రంగా గాయపడ్డారు. శిల్ప, శైలజ తిరుపతి వెళ్తున్నామని బస్టాండ్ దాకా వదలాలని కోరడంతో సంధ్య వాహనంలో ఇద్దరిని డ్రాప్ చేసేందుకు బయలుదేరారు. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మేలుకోటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. తీవ్రంగా గాయపడిన శైలజను ఆసుపత్రికి తరలించారు. స్నేహితులకు సాయం చేసేందుకు వెళ్లిన మహిళ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.



ప్రసంగిస్తున్న గొ.రు.చన్నబసప్ప

### జలాల వినియోగంలో రాష్ట్రానికి అన్యాయం

- సాహిత్య సమ్మేళనంలో సుదీర్ఘ చర్చ
- పోటెత్తిన కన్నడ అభిమానం
- లక్షలాది పుస్తకాలు

- వివరాలు..7లో

# వెనుకబడిపోయారు..!



- బీసీ కార్పొరేషన్ గ్రాంట్ల వాడకంలో నిర్లక్ష్యం
- మిగిలిపోయిన 59 శాతం నిధులు
- ఉప్పార, మడివాళ, సవితా శాఖల్లో ఘోరం
- రుణాలు మంజూరుపై దృష్టి పెట్టని నేతలు





బెంగళూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెనుకబడినవర్గాల అభ్యున్నతికోసం ప్రత్యేకంగా కులాలకు అనుబంధంగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కులాల్లో పేదవర్గాలు వృత్తిపరంగా జీవిస్తున్నవారికి కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందజేయడం వీటి ధ్యేయం. అయితే కార్పొరేషన్లకు కేటాయించిన గ్రాంట్ల వాడకంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆయా వర్గాల సంక్షేమం కోసం పది కార్పొరేషన్లలో మూడేళ్లుగా కేటాయించిన గ్రాంట్లలో 59శాతం మిగిలిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 2021-22 నుంచి 2023-24 వరకు మూడేళ్లలో 1413 కోట్ల రూపాయల గ్రాంట్లు కేటాయించారు. ఇందులో 585.55 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యింది. ఓవైపు అభివృద్ధికి గ్రాంట్లు లేవని ఎమ్మెల్యేలతోపాటు వివిధ విభాగాల పనుల్లో కోత పెడుతున్నారు. స్వయంగా శాసనసభ్యులు నియోజకవర్గాలలో తిరగలేకపోతున్నామని ఇదే పరిస్థితి కొనసాగితే రాజీనామా చేస్తామని అధికార కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు బహిరంగంగానే వాపోతున్నారు. మరోవైపు కార్పొరేషన్ల ద్వారా సంక్షేమం అమలు చేయాలని గ్రాంట్లు విడుదల చేస్తున్నా సగం కూడా ఖర్చు చేయకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడినవర్గాల సంక్షేమ, స్వావలంబన కోసం ప్రభుత్వాలు ప్రత్యేక అభివృద్ధి కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ వచ్చాయి. బీసీ సంక్షేమశాఖ పరిధిలో పదకొండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో పది కార్పొరేషన్లలో మూడేళ్లలో కేటాయించిన నిధుల్లో ఖర్చు చేయలేదు. సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వంలోనూ బీసీ కార్పొరేషన్లకు కేటాయించిన గ్రాంట్లలో 37శాతం ఖర్చు కాలేదు. బీజేపీ పాలనలో బీసీ కార్పొరేషన్ల నిధులు సజావుగా ఖర్చు చేయలేకపోయారు. అప్పట్లో వెనుకబడినవర్గాలలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా గంగాకల్యాణ పథకం కింద బోరుబావులు తవ్వించి వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగుకోసం 19వేలమంది దరఖాస్తులు చేసుకోగా వారికి సకాలంలో ఎటువంటి అవకాశం లభించలేదు.

### నిధుల వినియోగంపై దృష్టి శూన్యం

అరసు, వీరశైవ, ఒక్కలిగ, మరాఠా అభివృద్ధి కార్పొరేషన్‌లు గ్రాంట్లను కొంతమేర ఉపయోగించుకున్నాయి. కానీ అంబిగ, ఉప్పార, మడివాళ, సవితా, విశ్వకర్మ కార్పొరేషన్లు వెనుకబడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో కార్పొరేషన్ల ద్వారా బోరుబావుల తవ్వకానికి దరఖాస్తులు చేసుకున్నారు. అయితే రాజకీయంగా వివిధ కారణాలతో అమలు చేయలేకపోయారు.

దేవరాజ్ అరసు వెనుకబడినవర్గాల కార్పొరేషన్ మూడేళ్లలో రూ.292 కోట్లు ఖర్చు చేసింది. వీరశైవ అభివృద్ధి కార్పొరేషన్ కూడా రూ.88 కోట్లు ఖర్చు చేసింది, ఒక్కలిగ అభివృద్ధి కార్పొరేషన్ రెండేళ్లలో 62 కోట్ల రూపాయలు, మరాఠా అభివృద్ధి కార్పొరేషన్ రెండేళ్లలో 51 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

### కార్యరూపం దాల్చని కార్పొరేషన్లు

గత ప్రభుత్వం 9 కార్పొరేషన్లను ఏర్పాటు చేసేందుకు ప్రకటించింది. అవి ఇంకా కార్యరూపం దాల్చలేదు. గణిగ అభివృద్ధి కార్పొరేషన్, హడపద అభివృద్ధి, మాలి, మాలగార్, హలాగార్ అభివృద్ధి కార్పొరేషన్, బలిజ అభివృద్ధి కార్పొరేషన్, తిగళర అభివృద్ధి కార్పొరేషన్, కుంబార అభివృద్ధి కార్పొరేషన్, కొడవ అభివృద్ధి కార్పొరేషన్, చేనేత అభివృద్ధి కార్పొరేషన్, పింజార, నదాఫ్‌తోపాటు మరో 13 కులాల అభివృద్ధి కార్పొరేషన్లు ఏర్పాట్లు కావాల్సి ఉంది. కార్పొరేషన్ల ప్రారంభానికి మెమొరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంఓఏ), ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ (ఏఓఏ)లు ప్రక్రియ పూర్తి చేశాక కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి.

**2023-24లో గ్రాంట్ల కేటాయింపులు (కోట్లలో )**

| కార్పొరేషన్ | కేటాయింపు | వినియోగం | మిగులు |
|---|---|---|---|
| దేవరాజ్ అరసు | 102 | 64.48 | 37.51 |
| అంబిగర చౌడయ్య | 5 | 0 | 5 |
| ఉప్పార | 8 | 3.80 | 4.19 |
| మడివాళ మాచిదేవ | 9 | 2.93 | 6.97 |
| సవితా సమాజ | 5 | 1.31 | 3.69 |
| మరాఠా | 50 | 11.05 | 38.95 |
| ఒక్కలిగ | 100 | 25.62 | 74.38 |
| వీరశైవ | 61 | 22.58 | 39 |
| విశ్వకర్మ | 13 | 6.72 | 6.28 |
| కాడుగొల్ల | 15 | 0 | 15 |



# విహంగ విహారం..!





మంగళూరు నగర విహంగవీక్షణం, హెలీ టూరిజం హెలికాప్టర్ (ఇన్‌సెట్లో)

పర్యాటకులు ఆకాశంలో విహరిస్తూ.. ఉత్సవాలను తిలకించే అవకాశం దక్కింది. దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరులో 'కరావళి ఉత్సవ' తిలకించేందుకు హెలీటూరిజం శనివారం ప్రారంభించారు. తుంబి ఎయిర్‌ట్యాక్స్ కంపెనీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా హెలీటూరిజం ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారి ముల్లై ముగిళన్, నగర కమిషనర్ అనుపమ్ అగర్వాల్, ఎస్పీ యతీశ్ వెల్లడించారు. జిల్లాకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత హరేకళ హాజప్ప, మహాలింగ నాయక హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టి నగర సౌందర్యాన్ని ఆస్వాదించారు. ఈనెలాఖరు వరకు హెలీటూరిజం అందుబాటులో ఉండనుంది.

7



# ఉత్తరానికి ఉపద్రవం..!

- కొప్పళ జిల్లాలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- భూమి గుర్తింపునకు నోటిఫికేషన్
- వణ్యప్రాణులకు ముప్పు తప్పదు
- వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు

8





ఈఓకు వెండి కిరీటాన్ని అందజేస్తున్న భక్తులు

## స్వామి వారికి వెండి కిరీటం అందజేత

ఉరవకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన జీ. శ్రీరాములు, ఓబయ్య కుటుంబసభ్యులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఈఓ రమేష్ బాబుకు శనివారం ఈ కిరీటాన్ని అందజేశారు. దీని విలువ రూ.లక్ష ఉన్నట్లు భక్తులు తెలిపారు. నూతన రథం నిర్మాణానికి అనంతపురానికి చెందిన భక్తుడు శ్రీరాములు రూ.1.1లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా పల్లకి సేవ

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

## ధ్యానంతో ఆరోగ్యం

### అంతర్జాతీయ ధ్యానదినోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ధ్యానం చేయడం అలవర్చుకోవాలని, ధ్యానంతో మనసు, శరీరం ఆరోగ్యంగా ఉంటాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఉదయం నగరం లోని ఒకటో రోడ్డు కాశీ విశ్వేశ్వరదేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ కనీసం ఒక గంటైనా ధ్యానం కోసం కేటాయించాలన్నారు. వివేకానందయోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మ విశ్వకుమారి సంస్థ ప్రతినిధి శార, డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా, అంతర్జాతీయ ధ్యానదినోత్సవాల గురించి వివరించారు. అనంతరం గంటపాటు ధ్యానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద యోగా కేంద్రం, పతంజలి యోగా సమితి, రామకృష్ణ ప్రచార సమితి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, హార్ట్‌ఫెల్‌నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూట్, పిరమిడ్‌ధ్యాన కేంద్రం, సత్యసాయి ధ్యానమండలి, ఆర్ట్‌ఆఫ్ లివింగ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**న్యూస్‌బాక్స్**

### రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం అర్హతలున్న మున్సిపల్ టీచర్ల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేస్తూ ప్రమోషన్లకు అర్హత ఉన్న ఎస్‌జీటీల ఫైనల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేశామన్నారు. 1:5 నిష్పత్తిలో జాబితాను సిద్ధం చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలోని టీచర్లు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు సర్వీస్ రిజిస్టర్లతో సోమవారం ఉదయం 11 గంటలకు డీఈఓ ఆఫీస్‌కు హాజరు కావాలని సూచించారు.

### వసూళ్లు పూర్తి చేయండి

మూడు నెలలే సమయం ..!

మార్కెట్ ఫీజు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి: జేడీ

అనంతపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో ఆర్థిక సం వత్సరం ముగుస్తుంది. ఆలోగా మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో శనివారం ఆయన అనంతపుం జిల్లా ఏడీ సత్యనారాయణ చౌదరితో కలిసి ఉ మ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యదర్శులతో మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లపై సమీక్షించారు. కమిటీల వారిగా నిర్దేశిత లక్ష్యాలు..వసూళ్ల గురించి అధికారులతో ఆరాతీశారు. ఫీజు వసూళ్లు మందకొండిగా సాగుతున్నాయన్నారు. ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం అనంతపురం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు రూ.12.06కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆర్‌జేడీ పేర్కొన్నారు. నవంబరు వరకు రూ.9కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. ఫీజు వసూళ్లలో అనంతపురం, శింగనమ ల కమిటీలు బాగానే ఉన్నాయన్నారు. రా ప్తాడు, గుత్తి కమిటీలు వసూళ్లలో వెనుకబడ్డాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో నూ వెనుకబడే ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు లక్ష్యాలపై ప్రత్యేక ప్ర ణాళికలు రూపొందించుకుని వసూలు చేయాలని ఆదేశించారు.

### 15 మందికి ఉత్తమ అవార్డులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 15 మంది వ్యవసాయ అధికారులను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. అనంతపురం ఏడీఏ రవి, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, పెనుకొండ ఏడీఏ స్వయం ప్రభ, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారులు సోమశేఖర్, సుధాకర్, కాత్యాయని, సాయికుమార్, ముస్తాఫా, తిమ్మప్ప, సురేంద్రనాయక్, సతీష్ బాబు, నరసింహులు, లీలా వసుంధర ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న మరో 12 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఆ అధికారులకు ఈనెల 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండలోని ఉరగాద్రి కల్యాణ మండపంలో అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ నిర్వాహకులు ఓబులేసు తెలిపారు.

### సీపీఎం సభలకు సన్నద్ధం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23, 24వ తేదీల్లో గుత్తిరోడ్డులోని ఎస్ఎస్ గ్రాండ్‌లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నారు. దాదాపు 11 సంవత్సరాల తర్వాత అనంతపురం వేదికగా మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నుంచే ఏర్పాట్లకు ఆ పార్టీ నాయకులు సమాయత్తమయ్యారు. మహాసభల సూచికగా నగరంలోని క్లాక్‌టవర్ కూడలితోపాటు వివిధ ప్రధాన కూడళ్లలో సీపీఎం జెండాలను కడుతూ ఎరుపుమయం చేస్తున్నారు. మహాసభల సన్నాహకంగా ఆదివారం వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నారు. మహాసభలకు అన్నివర్గాల వారు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు.

### రేపటి నుంచి 'ఓపెన్' ఫీజుల చెల్లింపు

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 10 వరకూ ఫీజు చెల్లించవచ్చునని డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 23 నుంచి 31వరకూ, ఒక సబ్జెక్టుకు రూ. 25ల ఫైన్‌తో జనవరి 1 నుంచి 4 వరకూ, రూ.50ల ఫైన్‌తో జనవరి 5 నుంచి 8 వరకూ, తత్కాల్ రుసుంతో జనవరి 9 నుంచి 10 వరకూ ఫీజులు చెల్లించవచ్చునన్నారు.

# హాట్‌సీట్..!

కంబదూరు సీడీపీఓ పోస్టుకు డిమాండ్

గుట్టుగా నలుగురి ప్రయత్నం

భారీగా ఆదాయం ఉండటంతోనేనా...?

గతంలో మాజీ మంత్రి అండతో లక్షల్లో అవినీతి



కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎస్‌లో సీడీపీఓ పోస్టుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టుకు నలుగురు పోటీ పడుతు న్నారు. ఇక్కడ సీడీపీఓగా పనిచేసిన వనజా అక్కమ్మ ఏపీడీగా ఉద్యోగోన్నతిపై ఈ నెల 11న రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ సీడీపీఓ పోస్టు దక్కించుకునేందుకు నలుగురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

**అతి పెద్ద ప్రాజెక్టుగా కంబదూరు**

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే అతి పెద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టుగా కంబదూరు ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 198 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. పెద్ద ప్రాజెక్టు కావడంతో నిధులు కూడా భారీగానే వస్తుంటాయి. దీంతో అక్రమార్జనకు అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో సీడీపీఓ పోస్టు కోసం పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆ పోస్టు దక్కించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సీడీపీఓలు గుట్టుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరిలో శశికళ, యల్లమ్మ, నాగమణితో పాటు మరో సీడీపీఓ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో భారీగా ఆదాయ మార్గాలు ఉండటంతోనే ఇక్కడి సీడీపీఓ పోస్టుకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటం, కర్ణాటకకు సమీపంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు గురించి ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ గతంలో పని చేసిన కొందరు అడ్డూ అదుపు లేకుండా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో చేసినా అడిగే వారే లేరన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తుంటాయి.

**వైసీపీ పాలనలో భ్రష్టుపట్టిన ప్రాజెక్టు**

వైసీపీ పాలనలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉష శ్రీచరణ్ పనిచేసిన కాలంలో ఈ ప్రాజెక్టు భ్రష్టు పట్టిపోయిందనే విమర్శలు ఉన్నాయి. మంత్రి అండతో ఇష్టానుసారం పోస్టులను భర్తీ చేశారన్న ఆరోపణలు వినిపించాయి. అప్పట్లో ఆ ఐసీడీఎస్ కార్యాలయం దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. అక్కడ పనిచేసే అధికారి ఆడిందే ఆట, పాడిందేపాటగా సాగి ంది. అడిగే వారు లేరని దర్జాగా పోస్టులను అమ్మేసుకున్నారు. హెల్పర్లకు ప్రమోషన్ కల్పిస్తూ, ఇష్టానుసారంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఆ పోస్టులను భర్తీ చేశారు.

**ఒక్కో పోస్టుకు లక్షల్లో వసూలు**

వైసీపీ పాలనలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలిసింది. అధికారితో ఓ జూనియర్ అసిస్టెంట్ కుమ్మక్కై పోస్టులను భర్తీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. ఆ అక్రమ వసూళ్లను వీరిద్దరూ వాటాలు వేసుకుని పంచుకున్నట్లు తెలిసింది. వైసీపీ హయాంలో ప్రశ్నించే వారే లేరన్న ధీమాతో పోస్టులను ఎడాపెడా పోస్టులు భర్తీ చేసేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ అక్రమ వసూళ్ల తతంగం ఎక్కడికి దారి తీస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

**జిల్లా కేంద్రం నుంచి వచ్చిపోతున్న సూపర్‌వైజర్లు**

కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయానికి సూపర్‌వైజర్లు ప్రతి రోజూ జిల్లా కేంద్రం వచ్చి పోతుంటారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఈక్రమంలోనే అంగన్‌వాడీల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే సూపర్‌వైజర్లు విధులకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. ఈ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చే నిధులన్నీ పక్కదారి పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయ పనితీరుపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎన్‌ఆర్‌ఐలకు అండ

### ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గంటా శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐలకు కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఖతార్‌లో ఎన్‌ఆర్‌ఐలు శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రవాసాంధ్రులు పోలింగ్ రోజున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. మీరంతా అభిమానంతో మద్దతు ఇవ్వడం వల్లే చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో కూటమికి 164 సీట్లు వచ్చాయన్నారు. జగన్ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కించి, దేశంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఖతార్‌లోని ప్రవాసాంధ్రులకు అవసరమైన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం అమిలినేని సురేంద్రబాబును, గంటా శ్రీనివాసరావుని ఖతార్‌లో టీడీపీ, జనసేన శ్రేణులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

## హెచ్చెల్సీ చైర్మన్‌గా కడప జోగిరెడ్డి

### వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన కేశవరెడ్డి



హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులతో బీటెక్ రవి, వెంకటశివుడు యాదవ్ తదితరులు



చైర్మన్ జోగిరెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు చైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌చైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహిం చారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు హెచ్ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖరరెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పోట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల చైర్మెన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

## లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

### డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



జిల్లా కమిటీతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె జిల్లా కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డబ్బులకు ఆశపడి లింగ నిర్ధారణ చేసే డాక్టర్లు, స్కానింగ్‌సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆధారాలతో దొరికితే చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేసి ఆస్పత్రులు, స్కానింగ్‌సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేసిన డాక్టర్ల సర్టిఫికెట్లను రద్దు చేస్తామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకే ఆ ప్రాంతాలలో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. అందుకే సరిహద్దుప్రాంతాల అధికారులతో త్వరలో సమన్వయ సమావేశం నిర్వహించి, ఉమ్మడిగా తీసుకోవా ల్సిన చర్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలోను ప్రచార పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టరు సుజాత, డాక్టరు యుగంధర్, డాక్టరు రవికుమార్, డాక్టరు అనుపమజేమ్స్, డాక్టరు ప్రసన్నభారతి, డాక్టరు లక్ష్మీ, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటకుమారి, డీపీఆర్ఓ గురుమూర్తి, డెమోలు త్యాగరాజు, గంగాధర్, ఆర్డీటీ డాక్టరు దుర్గేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిత, వేణు, వెంకటేష్, శ్రీకాంత్, ఉషారాణి పాల్గొన్నారు.

## 24న మెగా జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత కోరారు. తన కార్యాలయంలో వీసీ శనివారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్హతకు తగిన ఉద్యోగ, ఉపాధిని కల్పించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలను సమన్వయం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, ఎస్కేయూ సంయుక్తంగా 24న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవ టెక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, ఐ-సన్ టెక్నాలజీస్, టీసీఎస్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 18నుంచి 30 సంవత్సరాల లోపు వయసుగల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు యూఎస్‌డీఓ కరీముల్లా 8341366022 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

### - అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఎంపీ ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా జాబ్ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అన్ని ట్రేడ్స్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు చిత్తూరు, తిరుపతిలోని అమరరాజా బ్యాటరీస్ సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన ఉద్యోగులకు ట్రైనింగ్ సమయంలో రూ.12,500 నుంచి రూ.13,600 వరకు ఇవ్వడంతోపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేలు వేతనం ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000024919, 9000433990 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## గుత్తి పీఎస్‌లో నలుగురు బదిలీ

గుత్తి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ రామచంద్రరెడ్డిని అనంతపురం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, హెడ్‌కానిస్టేబుళ్లు జాఫర్, బాలాజీలను అనంతపురం వన్‌టౌన్‌కు, షాజహాన్‌కు అనంతపురం టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

### వీఆర్‌కు కానిస్టేబుల్

ఉరవకొండ: ఉరవకొండ అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపినట్లు సమాచారం. సంతకాలను ఫోర్జరీ చేసి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో అతనిపై వేటు పడింది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

## ఆశాలపై వేధింపులు ఆపాలి: సీఐటీయూ

అనంతపురం టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశాలపై ఎంఎల్‌హెచ్‌పీల వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకురాలు, ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓను సీఐటీయూ నాయకులు శనివారం కలిశారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఆశావర్కర్లతో సంబంధంలేని పనులు చేయిస్తూ, వేధింపులకు దిగడం అన్యాయమన్నారు. సచివాలయాల వద్దకు రావాల్సిందేనని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆశాలను వేధిస్తున్నారని తెలిపారు. తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, రాయదుర్గం, తదితరప్రాంతాలలో మూడు వేల నుంచి ఆరు వేలమందికి ఒక ఆశాను కేటాయించారని అలాంటపుడు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఈఒత్తిడి, మానసికవేదన తట్టుకోలేకనే ఉరవకొండలో ఆశా ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆశాలపై వేధింపులు, ఒత్తిళ్లు ఆపకపోతే పెద్దఎత్తున సీఐటీయూ తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే ప్రయోజనం

### ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతోందని ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరెడ్డి, దేవాంజనేయులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల నైట్ అవుట్ అలవెన్సులను నిలుపుదల చేయగా.. వాటిని పునరుద్ధరించి, జనవరి నెల జీతంలో కలిపి చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో శనివారం అనంతపురం డిపో వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉన్న ప్రయోజనాలను సైతం అందకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. చంద్రబాబునాయుడు అలవెన్సులను పునరుద్ధరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమర రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్, జయప్రకాష్, మదార్, మల్లికార్జున, జి.గోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

## గొర్రెకు నాలుగు పిల్లలు



కుందుర్పికి చెందిన సజ్జల కేశన్న మందలో ఒక గొర్రె ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా గొర్రెలు ఒక కాన్పులో ఒక పిల్లకే జన్మనిస్తాయి. అరుదుగా రెండు పిల్లలకు జన్మనిస్తాయి. కానీ జన్యుపరమైన మార్పులు జరిగినప్పుడు మాత్రం అంతకు మించి పిల్లలు పుడతాయని పశు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. విషయం తెలియగానే ఆయన వెళ్లి గొర్రెను, పిల్లలను పరీక్షించారు. అన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ వింతను చూసేందుకు స్థానికులు ఆసక్తికనబరిచారు.

- ఆంధ్రజ్యోతి, కుందుర్పి

## నేడు 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సభా ప్రాంగణాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సయ్యద్ అమీర్ మసూది సాహెబ్, జబల్‌పూర్‌కు చెందిన అబ్దుల ఖాదీర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, సాహాబాల పవిత్ర కేశాలు, వారి వస్త్రాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించనున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా ఖాద్రి వెల్లడించారు. సున్నీ ఇజ్‌తెమాకు జిల్లాలోని వివిధ ముస్లిం సంఘాలు మద్దతు తెలుపుతూ శనివారం వేదికను సందర్శించాయి. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, ఇంతియాజ్, ఎంఎండీఏ ఇమామ్ తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, హబీబ్, డాక్టర్ షఫి, అబ్దుల్ సమి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### శారదాదేవి (జయంతి)




ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రామకృష్ణ పరమహంస సతీమణి శారదాదేవి 1853 డిసెంబరు 22న పశ్చిమబెంగాల్ రాష్ట్రం జయరాంబాటి గ్రామంలో జన్మించారు. అసలు పేరు శారదామణి ముఖోపాధ్యాయ. యోగిని (హోలీ మదర్)గా పేరొందారు. రామకృష్ణ మఠం, మిషన్ విస్తరణలో ఎంతో కృషి చేశారు. శిష్యులు ఆవిడను ఆదిశక్తి అవతారంగా భావిస్తారు. ధ్యానం, జపం చేయాలని, ఇతరులలో తప్పులు వెతకడం మానేయాలని సూచించేవారు. 1920 జూలై 20న పరమపదించారు.

### శ్రీనివాస రామానుజన్ (జయంతి)



గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ 1887 డిసెంబరు 22న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. 20వ శతాబ్దంలో పేరొందిన గణిత మేధావులలో ఒకరు. పదేళ్ల వయస్సులోనే అపార ప్రతిభ చాటుకున్నారు. మ్యాథమ్యాటికల్ అనాలసిస్, నంబర్ థియరీ, ఇన్‌ఫినిట్ సిరీస్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్ అంశాలపై ఎన్నో సూత్రాలు ప్రతిపాదించారు. 32వ యేట 1920 ఏప్రిల్ 26న కన్నుమూశారు.

### స్వామి సచ్చిదానంద సరస్వతి (జయంతి)



స్వామి సచ్చిదానంద సరస్వతి 1914 డిసెంబరు 22న కుడలోర్‌లో జన్మించారు. అసలు పేరు సీకే రామస్వామి గౌండర్. గురువు శివానంద సరస్వతిచే 1949లో సన్యాసదీక్ష స్వీకరించారు. యోగా, ఆధ్యాత్మిక, తత్వగురువుగా పేరొందారు. పలు ఆధ్యాత్మిక, తత్వ పుస్తకాలు రాశారు. పతంజలి యోగ సూత్రాలు, భగవద్గీతలను అనువాదం చేశారు. స్వామి శివానంద శిష్యుడిగా హఠ, రాజ, భక్తి, కర్మ, జ్ఞాన, జప యోగా (ఇంటిగ్రల్ యోగా)ను ప్రపంచవ్యాప్తం చేశారు. 2002 ఆగస్టు 19న పరమపదించారు.

### పసుమర్తి రామలింగశాస్త్రి (పుట్టినరోజు)



పసుమర్తి రామలింగశాస్త్రి సంప్రదాయ నృత్యకుటుంబంలో 1958 డిసెంబరు 22న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. ఎందరో గురువుల వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందారు. లక్ష్మణ, దూర్వాస, శివ వంటి పాత్రలకు, రామాయణ, అభిజ్ఞాన శాకుంతలం వంటి నాటకాలు, నృత్య సన్నివేశాలకు వన్నె తెచ్చారు. ఉభయనాట్య ప్రవీణ, నాట్య కళాధర, నృత్య విద్వన్మణి, పురస్కారాలు పొందారు. ప్రస్తుతం హైదరాబాద్ యూనివర్శిటీలోని సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్‌కు డీన్‌గా కొనసాగుతూ 25ఏళ్ల సర్వీసు పూర్తి చేశారు.

## విద్యారంగాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యం : మంత్రి సవిత

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేబీ పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లను నిశితంగా పరిశీలించారు. దోమలు విపరీతంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఫాగింగ్‌చేసి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను కలిసి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, హాస్టల్లో భోజన సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజు హాస్టల్ పరిసరాల్లో పోలీస్ గస్తీ నిర్వహించాలని ఎస్‌ఐ క్రిష్ణమూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమాదేవి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, జంగం వెంకటరాముడు, నారాయణస్వామి, మంజు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తరహళ్లి హుండీల ఆదాయం రూ.21 లక్షలు

మడకశిర రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలను శనివారం లెక్కించారు. ఈ రెండు దేవాలయాల నుంచి రూ.21.01 లక్షలు వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆంజనేయస్వామి హుండీ నుంచి రూ.8.11 లక్షలు, నరసంహస్వామి హుండీ నుంచి రూ.12.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ వివరించారు.

## ఘనంగా గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్ వార్షికోత్సవాలు

గుత్తి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే డీజిల్ లోకో షెడ్ 61వ వార్షికోత్సవాలను స్థానిక డీజిల్ షెడ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, కేక్‌ను కట్ చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుత్తి రైల్వే డీజిల్ షెడ్ కార్మికులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. అనంతరం డీజిల్ షెడ్‌లో కంట్రోల్‌రూంను ఆయన ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను పంపిణీ చేశారు.

## పరీక్షా పే చర్చ ద్వారా సమస్యల పరిష్కారం

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ ద్వారా విద్యా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా పే చర్చ-2025 కార్యక్రమానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన తెలిపిన వివరాల మేరకు 2025 జనవరి 14 లోపు గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6నుంచి 12తరగతివరకు చదివిన విద్యార్థుల తల్లిదండ్రులు అర్హులన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు పై గవర్నమెంట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

# జలాల వినియోగంలో రాష్ట్రానికి అన్యాయం



విజేతలకు బహుమతుల ప్రదానంలో ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య తదితరులు

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జలాల వినియోగంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని వక్తలు అభిప్రాయపడ్డారు. అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో రెండోరోజు శనివారం కీలక అంశాలపై చర్చాగోష్ఠి సాగింది. ప్రధానంగా జలాల వినియోగంపై సుదీర్ఘంగా సాగిన చర్చాగోష్ఠిలో జలనిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కావేరి జలాల విషయంలో సాగుతున్న పోరాటాన్ని ప్రస్తావించారు. మహదాయి నీటికోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా కదలిక లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేశారు. ధారవాడ, నవలగుంద, నరగుంద ప్రాంతాలకు తాగునీటికోసం జరుపుతున్న పోరాటంపై ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. గతంలో ఏకంగా ఏడాదిపాటు ఆందోళనలు చేసినా ఫైళ్లలో కదలికలు లేవన్నారు. మహదాయి నదిని మండోవిగా పిలుస్తారని పశ్చిమ కనుమలలో పుట్టే ఈ నది గోవా రాష్ట్రానికి జీవనాడి అన్నారు. కానీ ఇక్కడ పుట్టేనది స్థానికులకు సద్వినియోగం కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. కృష్ణ నదికి అనుబంధంగా ఆల్మట్టి ప్రాజెక్టు 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచే ప్రతిపాదనకు ఏళ్లు గడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉద్భవించే నదులు రాష్ట్ర ప్రజలకు సద్వినియోగం కావాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కాగా రెండోరోజు సాహిత్య అభిమానం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఉదయం 9 గంటలనుంచి ప్రజలు ప్రధాన వేదిక వద్దకు వచ్చేందుకు ప్రారంభమైంది. 12 గంటల తర్వాత ఎటు చూసినా ప్రజల సందడి అనిపించింది. మండ్య వీధులలో ప్రతిచోటా సాహిత్య అభిమానం కనిపించింది. ప్రధాన వేదికతోపాటు ఇతర ప్రాంతాలలోని వేదికల వద్ద కూడా సాహిత్య అభిమానం పులకరించింది.

ప్రధాన వేదిక పక్కనే మండ్య జిల్లా రైతులు ప్రధానంగా పండించే చెరుకు ద్వారా బెల్లం తయారీ విధానం ప్రత్యేక ఆకర్షణ అనిపించింది. 20రకాలకుపైగా బెల్లం విక్రయానికి ఉంచారు. ప్రాచీన గ్రామీణ విధానాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ విశేషం అనిపించాయి. ఒకప్పుడు ఇంట్లో ఉపయోగించే వస్తువులు, పనిముట్లు, వంట తయారీకి ఉపయోగించే వస్తువులను ప్రదర్శింప చేశారు. మండ్యలో పండే సుమారు 15రకాల వరి వంగడాలు గురించి తెలిపేలా నమూనాలు ఏర్పాటు చేశారు. రాగుల రాశులు ఆకట్టుకున్నాయి.

### వందలాది స్టాల్స్ - లక్షలాది పుస్తకాలు

సాహిత్య సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా బుక్‌స్టాల్స్ వెలిశాయి. వందలాది స్టాల్స్ ద్వారా వివిధ పబ్లికేషన్స్ లక్షలకొలదీ పుస్తకాలను ఏర్పాటు చేశారు. సాహిత్యానికి సంబంధించి కొన్ని దశాబ్దాలనాటి పుస్తకాలు సమ్మేళనంలో కనిపించాయి. పుస్తకాల కొనుగోళ్లకు సాహితీప్రియులు అన్నివర్గాల ప్రజలు ఆసక్తి చూపారు. వివిధ పోటీల విజేతలకు ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య నేతృత్వంలో బహుమతులు ప్రదానం చేశారు. సమ్మేళనాధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప, ఎమ్మెల్యే హెచ్‌కెపాటిల్, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌జోషి, బీఎల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న విద్యార్థులు తదితరులు

# విహంగ విహారం..!

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరు కేంద్రంగా 'కరావళి ఉత్సవ' (తీరప్రాంత ఉత్సవం)ను తిలకించేందుకు హెలిటూరిజం ప్రారంభిం చారు. శనివారం కరావళి ఉత్సవం లాంఛనంగా ప్రారంభమయ్యింది. తుంబి ఎయిర్‌ట్యాక్స్ కంపెనీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా హెలిటూరిజం ఏర్పాటు చేసినట్టు జిల్లా అధికారి ముల్లై ముగిళన్, నగర కమిషనర్ అనుపమ్ అగర్వాల్, ఎస్పీ యతీశ్‌లు వెల్లడించారు. ఉత్సవాల ప్రారంభంలో జిల్లాకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత హరేకళ హాజప్ప, మహాలింగనాయక హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టి నగర సౌందర్యాన్ని ఆస్వాదించారు. ఆకాశంలో విహరించి సముద్రం, మంగళూరు నగర సౌందర్యాన్ని వీక్షించేవారికి ఈనెలాఖరు వరకు హెలికాప్టర్‌లో ప్రయాణించే అవకాశం ఉంది. ఒక రౌండ్‌లో మంగళూరు నగరం, నేత్రావతి నది తీరం, పణంబూరు బీచ్ సౌందర్యాన్ని వీక్షించవచ్చు. ప్రతిరౌండ్‌లోనూ ఆరుగురికి హెలికాప్టర్‌లో తిరిగే అవకాశం ఉంది. ఇందుకోసం రూ.4,500 చార్జీగా నిర్ణయించారు. ఎవరైనా హెలికాప్టర్‌లో ప్రయాణించవచ్చు. మంగళూరుతోపాటు సముద్రాన్ని, నదిని ఆకాశం నుంచి వీక్షించవచ్చు. మేరిహిల్ హెలిప్యాడ్ నుంచి సహ్యాద్రి గ్రౌండ్‌కు మార్పు చేయాలని భావిస్తున్నట్లు జిల్లా అధికారి తెలిపారు. మేరిహిల్స్ సమీపంలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నందున విమానాల రాకపోకలకు సాంకేతిక సమ స్య కానుందని తాత్కాలికంగా గతంలో నిలిపివేశారు. అడయార్‌లోని సహ్యాద్రి గ్రౌండ్‌కు మార్పు చేసి హెలిటూరిజంకు వీలు కల్పించారు.

## కావేరి ఐదో దశతో సంతృప్తి

మహదేవపుర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావేరి ఐదోదశ పనులు పూర్తయ్యాయని ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి నీరు అందడం ద్వారా తృప్తిగా ఉందని మాజీ మంత్రి, టాస్క్‌ఫోర్స్ చైర్మన్ అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్ళిలో ఎమ్మెల్యే మంజుళాతో కలసి నియోజకవర్గంలోని 31 గ్రామాలకు నీరు అందేలా శ్రమించిన ప్రముఖులకు మహదేవపుర టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో సత్కరించి మాట్లాడారు. కావేరి ఐదో పథకానికి సంబంధించి వివిధశాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేసి ప్రతి ఇంటికి నీరు అందేలా చేయగలిగామన్నారు. 2007-08లో బీబీఎంపీ ఏర్పాటై పదేళ్ల తర్వాత పనులు ప్రారంభమయ్యాయన్నారు. మహదేవపుర పరిధిలోని 31 గ్రామాలకు కావేరి ఐదోదశ పైప్‌లైన్ పనుల ద్వారా నీరు అందించడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి తేవడం ద్వారా ఈ పథకం విజయవంతమైందన్నారు. ఇందుకు శ్రమించిన అధికారులందరినీ సన్మానిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హోబళి బీజేపీ అధ్యక్షుడు, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ జలశక్తి అధ్యక్షుడు మనోహరరెడ్డి, గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు, టాస్క్‌ఫోర్స్ మొబిలిటి అధ్యక్షుడు బిఎన్ నటరాజ్, టాస్క్‌ఫోర్స్ మెంబర్ సెక్రటరీ జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులకు సన్మానం

## ధర్మాచరణతోనే జీవితానికి సార్థకత



అరివిన మనెలో పాల్గొన్న వక్తలు, భక్తులు

విజయపుర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని ఆచరించడం ద్వారా జీవితానికి సార్థ్యకత అని, భగవంతుడి కోసం ఎక్కడెక్కడో వెతకాల్సిన అవసరం లేదని అందరి మనసులలో ఉన్నాడని గీత ప్రచారకులు కృష్ణప్ప దాస అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అక్కన బళగ ఆధ్వర్యంలో అరివిన మనెలో వీరభద్రస్వామి గోష్ఠిలో పాల్గొని 115వ 'తింగళ బెళకు' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గీత ప్రచారకుడిగా వ్యవహరిస్తున్న తాను శివశరణల వచనాలను అభ్యాసం చేసి వచనాల ద్వారా నైతిక విలువలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. వీరభద్రస్వామి గోష్ఠి కార్యదర్శి సురేశ్‌బాబు మాట్లాడుతూ జీవితంలో ఏదీ శాశ్వతం కాదని, ఉన్నంతకాలం మంచి పేరుతో జవించాలని అభిప్రాయపడ్డారు. గోష్ఠి అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ ధర్మాన్ని అనుసరించడంతోనే ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీకృష్ణ పరమాత్ముడు గీతలో బోధించారన్నారు. భానుప్రకాశ్, శివప్రసాద్, కోరమంగల రుద్రప్ప ట్రస్టు అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బైకులోని డబ్బు చోరీ

కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బొరుగుల అశోక్‌కు చెందిన రూ.75 వేలు శనివారం చోరీ అయ్యింది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన అశోక్ గ్రామంలో మూడు ఎకరాల్లో అరటి సాగు చేశాడు. పంటను కంపెనీ వారికి విక్రయించాడు. అందుకు సంబంధించిన నగదును వారు బ్యాంకు అకౌంట్‌లో వేశారు. దీంతో ఆయన డబ్బులు డ్రా చేసుకుని కూరగాయలు తీసుకునేందుకు బళ్లారి మిట్ట మీదకు వెళ్లాడు. అయితే డబ్బులు ద్విచక్ర వాహనంలోనే ఉంచాడు. కూరగాయలు తీసుకునే సమయంలో నీలి రంగు టీ షర్టు వేసుకుని వచ్చిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలోని డబ్బు ఎత్తుకుని వెళ్లాడని రైతు వాపోయాడు. ఈ ప్రాంతం డీఎస్పీ కార్యాలయం కూతవేటు దూరంలో ఉండటం గమనార్హం.

## ఎయిమ్స్ ఏర్పాటు చేసి జిల్లాకు న్యాయం చేయాలి

● రాయచూరు ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస



నగరంలోని స్టేడియం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

రాయచూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శనివారం 954వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధి స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీని పై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ ప్రాంత ప్రజల పట్ల వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తుందన్నారు. నాయకులకు ఎన్నికల పట్ల ఉన్న ధ్యాస అభివృద్ధి పై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి విద్యసంస్థను రాయచూరులో ఏర్పాటు చేసి ఈ జిల్లాకు న్యాయం చేయాల్సిన పాలకులు కనీసం ఎయిమ్స్ ఏర్పాటు ద్వార పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం తమ పోరాట సమితి చేస్తున్న సుదీర్ఘ కాల పోరాటాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.

### నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, నిర్మాల్యవిసర్జన, వి ష్ణుపారాయణం, అష్టోత్తరం ని ర్వహించి స్వామి వారి మూల విరాట్‌కు పుష్పాలంకరణ చేసి, నైవేద్యం సమర్పించారు.



## మహిళా సమస్యలపై పోరాటానికి కట్టుబడ్డాం

దొమ్మసంద్ర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేందుకు కట్టుబడ్డామని భారతీయ స్త్రీ శక్తి సంఘం ట్రస్టు రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్య ద్రావిడ్ శరవణ్ పేర్కొన్నారు. ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర శాఖ ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు అప్పుడప్పుడు చోటు చేసుకుం టున్నాయని అలా కొనసాగకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలలో మార్పుతోనే ఇలాంటి వాటికి నియంత్రణ సాధ్యమన్నారు. వధువుకు 18ఏళ్లు, వరుడికి 21ఏళ్లు నిండాకనే పెళ్లి చేయాలని సూచించారు. సంఘం ఆనేకల్ తాలూకా అధ్యక్షు రాలిగా గంగరత్నమ్మ పద్మరాజ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సగయమీరి, జిల్లా అధ్యక్షులు ఆయిషా, ద్రావిడ శరవణ, కోశాధికారి అనిత, ప్రియా, సరళ తది తరులు పాల్గొన్నారు.



శాఖ ప్రారంభంలో భాగ్య, తదితరులు

## షార్ట్ సర్క్యూట్‌తో టమోటా క్రేట్‌లకు అపారనష్టం

చింతామణి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణం చేళూరు రోడ్డులోని ఏపీఎంసీ మార్కెట్‌లో అకస్మాత్తుగా చోటు చేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. చౌడేశ్వరి కమిషన్ మండి యజమాని వెంకటస్వామికి చెందిన టమోటా మండిలో నిల్వ ఉంచిన ఖాళీ టమోటా క్రేట్‌లకు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి కాలిపోయాయి. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు చోటు చేసుకున్న ప్రమాదంలో 6 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. క్రేట్‌లనుంచి పొగ వస్తున్నట్టు గుర్తించి వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించడంలో సఫలీకృతులయ్యారు. మార్కెట్ పక్కన గోడౌన్‌లో ప్రమాదం జరిగింది. ఒకవేళ మార్కెట్‌లోపల షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటే ప్రమాదం తీవ్రత భారీగా ఉండేదని వ్యాపారులు అభిప్రాయపడ్డారు. సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ముప్పు తప్పిందన్నారు.




మార్కెట్‌లో గుమిగూడిన ప్రజలు

## ఎమ్మెల్సీ సీటీ రవి వ్యాఖ్యలు సమంజసం కాదు : కాంగ్రెస్



మీడియాతో పుట్టు ఆంజినప్ప

శిడ్లఘట్ట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణ సౌధలో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ సీటీ రవి తీరు సమంజసం కాదని కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప ఖండించారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధ్యతాయుతమైన హోదాలో ఉంటూ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరి కాదన్నారు. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆయనను పదవి నుంచి తప్పించాలని డిమాంò చేశారు. కాగా బీజేపీ నాయకులకు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల సదభిప్రాయం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. దేశనాయకులను గౌరవించలేని దుస్థితిలో బీజేపీ నాయకులు ఉన్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1628.48 | 1,589.84 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 780 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 7,145 | 894 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 88.47 | 10.90 |



తమలపాకులతో అలంకరణలో హనుమంతుడు

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేటే ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణంలో దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పేటే ఆంజనేయస్వామికి భక్తులు ఆకుపూజ, పుష్పాలంకార సేవలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



మట్టి తరలిస్తున్న వాహనం

సిరుగుప్ప, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిరుగుప్ప తాలుకాలోని ఆదోని రోడ్డు మార్గంలో భారీ వాహనాలతో ఎర్రమట్టి తరలిస్తున్నా గనుల శాఖ పట్టించుకోకపోవడం గమనార్హం. ముఖ్యంగా రాత్రి సమయాల్లో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు. అనుమతి లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## నకిలీ వైద్యులు పరుగో.. పరుగు



కప్పగల్లులో బోసిపోయిన క్లినిక్

బళ్లారిరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బళ్లారి గ్రామీణం, కంప్లి, కురుగోడు, సిరుగుప్ప తదితర ప్రాంతాల్లో ఆరోగ్య అధికారుల దాడులతో నకిలీ వైద్యులు మాయమయ్యారు. శుక్రవారం కప్పగల్లు గ్రామంలో ఐదు క్లినిక్‌లను సీజ్ చేయడంతో పలువురు ఆర్‌ఎంపీలు శనివారం కనబడకుండా పోయారు. దీంతో క్లినిక్‌లు బోసిపోయి కనిపించాయి. ఆరోగ్యశాఖాధికారులు నిత్యం వారిపై నిఘా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని గ్రామీణులు కోరుతున్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ పకడ్బందీగా అమలు కావాలి

● అటవీ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలి: అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే



అధికారులతో సమావేశంలో అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే

బళ్లారి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గనుల ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ పథకం పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే అధికారులకు సూచించారు. గనుల ప్రాంతంలో పర్యావరణం దెబ్బతినకుండా ఆహ్లాదకర వాతావరణ ఉండేలా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన అన్నారు. శనివారం బళ్లారిలోని అటవీశాఖ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కర్ణాటక మైనింగ్ ఎన్విరాన్‌మెంట్ రిస్టోరేషన్ కార్పొరేషన్(కేఎంఈఆర్‌సీ) నిధులు విడుదలు, చేపట్టిన పనులపై ఆరా తీశారు. అటవీప్రాంతంలో వన్యప్రాణుల రక్షణ, తాగునీరు ఏర్పాట్లు, నీటినిల్వలకు చేసిన చెక్‌డ్యాంలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బళ్లారి మైనింగ్ సర్కిల్‌లో 'సీ' కేటగిరీ గనులు ఎన్ని ఉన్నాయి. రెమిడియల్ ప్రాసెస్ కోసం మైనింగ్ కంపెనీలకు డీ గ్రేడెడ్ ఫారెస్టు భూములు ఎన్ని ఇచ్చారు అనే వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దావణగెర, కొప్పళ్, బళ్లారి, విజయనగర, చిత్రదుర్గం, డివిజన్లలో ఎక్కువ మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే అటవీభూములు ఎక్కడా ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. గనులు లీజ్ ప్రాంతంలో అటవీభూముల దురాక్రమణకు లోనుకాకుండా చూడాలని గుర్తించేందుకు శాటిలైట్ ఇమేజ్, కేఎంఎల్ ఏర్పాటు చేయాలని అన్నారు.. సీఎఫ్‌వో చంద్రశేఖర్ నాయక్, డీఎఫ్‌వో సందీప్, తదితర అధికారులు ఉన్నారు.

## టీకాతో శిశువుకు రోగనిరోధక శక్తి

● ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే మెడికల్ ఆఫీసర్ డా. శ్రీధర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

బళ్లారి సిటీ,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పుట్టిన శిశువుకు 12 ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడడానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి టీకా ఉపయోగపడుతుందని, వారి వయస్సుకు తగిన టీకాలు వేయించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే మెడికల్ ఆఫీసర్ డా. శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆడిటోరియంలో నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి సార్వత్రిక టీకాల కార్యక్రమంపై అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలోనే పిల్లలకు వచ్చేప్రాణాంతక వ్యాధులను అరికట్టేందుకు ప్రజలకు మరింత సమాచారం అందించాలన్నారు. ప్రధానంగా 12 ప్రాణాంతక వ్యాధులు ,వాటికి వ్యతిరేకంగా వయస్సు ప్రకారం ఇచ్చే టీకాలు పోలియో కోసం పోలియో టీకా, క్షయ వ్యాధికి బీసీజీ టీకా, కామెర్లు, పెర్టుసిస్ కోరింత దగ్గు, ధనుర్వాతం, రోటవైరస్,హెచ్ ఇన్‌ఫ్లూఎంజా, పెంటావాలెంట్ రోటావిస్ వ్యాక్సిన్, విరేచనాలు, మెదడువాపు కోసం జపనీస్ ఎన్సెఫాలిటీస్ టీకా,మీజిల్స్ రుబెల్లా కోసం మీజిల్స్ రుబెల్లాటీకా, అంధత్వానికి విటమిన్ -ఏ తదితర వాటిని తప్పనిసరిగా వేయించాలన్నారు. వీటన్నిటిని ఏడాదిలోపు పిల్లలకు తప్పనిసరిగా వేసేలా చూడాలని సూచించారు. ప్రతి గురువారం ఆరోగ్యకేంద్రాలు, గ్రామ వార్డుల్లో వ్యాక్సిన్‌లు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డాక్టర్ సురేఖ, సౌజన్య, యాస్మిన్, ఫీల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాంతమ్మ, హెల్త్‌ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

● నాసిరకం పనులపై రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బర్మన్న ఆగ్రహం



మాట్లాడుతున్న బర్మన్న

కంప్లి, డిసెంబరు 21(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న నాసిరకం పనులపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాజ్య ఉపాధ్యక్షుడు భర్మన్న డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన విజయనగర జిల్లాలోని కొట్టూరు తాలుకా పరిధిలోని నాగరకట్టే, అయ్యన్నహళ్లి, తమ్మేనాయకన హళ్లి ప్రాంతాలలో వాగుల్లో నిర్మించే చెక్‌డ్యామ్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, వెంటనే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా నాణ్యత లేని పనుల వల్ల సంవత్సరానికే అవి ధ్వంసమై రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం ద్వారా వచ్చేనిధులే కష్టంగా వుంది. అలాంటి సమయంలో ఇలా నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను వెంటనే బ్లాక్‌లిస్టులో చేర్చాలని కోరారు. ప్రజాధనం వృథా చేసే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు నిధి

కంప్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యాసాగర పాఠశాలలో చదువుతున్న సాయినిధి భరత నాట్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం జిల్లాలో జరిగిన పోటీల్లో సాయినిధి గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు నాగేశ్వరరావు, విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మరింత శిక్షణ కల్పించి రాష్ట్రస్థాయిలో రాణించేలా విజయం సాధించేలా చూస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సాయినిధిని అభినందించారు.



శ్రీ సాయినిధి

## ఉత్తరానికి ఉపద్రవం..!

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. కొప్పళ జిల్లాతో పాటు ఉత్తర కర్ణాటకలోని ఐదు జిల్లాలో ఒకేచోట 1200 ఎకరాల భూమిని గుర్తించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే కొప్పళ జిల్లా పరిధిలో వచ్చే తాలూకాల్లో భూమి గుర్తించేందుకు ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థల పరిశీలన కోసం కొప్పళ జిల్లాధికారి నలిన్ అతుల్ కొప్పళ తహసీల్దారుకు లేఖ రాశారు. అరసనకేరి గ్రామంలో అణువిద్యుత్ కేంద్రం స్థాపనకు అవసరమైన భూమి లభ్యత గురించి సమాచారం ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే ఈ గ్రామం పరిధిలో పట్టా, ప్రభుత్వానికి చెందిన మొత్తం 615 ఎకరాలు భూమి మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తహసీల్దార్ కొప్పళ జిల్లాధికారికి నివేదిక పంపారు. అరసనకేరి సమీపంలోని కరడిగుడ్డ, దానికి ఆనుకుని జనవసతి ప్రాంతం నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరంలో భూమిని గుర్తించినట్లు అధికార వర్గాల సమాచారం. భూమి గుర్తించే ప్రక్రియ ప్రాథమిక దశలో ఉండగానే, స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అరసనకేరి భాగంలో ప్రముఖులు, విధానపరిషత్ మాజీసభ్యులు కరియణ్ణ సంగణ్ణ, రైతులు జిల్లాధికారికి వినతిపత్రం అందజేశారు. కొప్పళ తాలూకాలో ఇరకల్లగడ ఫిర్కా పరిధిలో అరసనకేరి గ్రామంలో అణువిద్యుత్ కేంద్రం స్థాపనను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎలుగుబంట్లు ఉన్నందున ఈ ప్రాంతాన్ని కరిడి సంరక్షిత ధామగా గుర్తించినట్లు పేర్కొన్నారు.



మేయర్ నందీష్‌ను సన్మానిస్తున్న బోవి సమాజం సభ్యులు

## మేయర్‌కు బోవిసమాజం అభినందనలు

బళ్లారి సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇన్‌ఫాంట్రీరోడ్డులో వాసవి స్కూల్ సమీపంలోని సర్కిల్‌కు సిద్దరామేశ్వర్ సర్కిల్‌గా పేరు పెట్టేందుకు కార్పొరేషన్ నిర్ణయం తీసుకోవడంపై బోవిసమాజం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా బోవి వడ్డర్ సంఘం జిల్లాధ్యక్షుడు రామాంజనేయులు పదాధికారులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి మేయర్‌ముల్లంగి నందీష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సంఘం నాయకులు రామారెడ్డి, వెంకటేశ్, రవికుమార్, గూడుదురు హనుమంత, అంద్రాల్ వెంకటేశ్, సంగనకల్లు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న అణగారిన వర్గాల యూనియన్ సభ్యులు

బళ్లారి సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ రాజీనామ చేయాలని కర్ణాటక రాష్ట్ర అణగారిన వర్గాల బళ్లారి కూటమి డిమాండ్ చేసింది. శనివారం నగరంలో వారు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గాదిలింగనగౌడ మాట్లాడుతూ లోక్‌సభ సమావేశాల చర్చ సందర్భంగా దేశ హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా మాట్లాడడం తగదన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లు తొలగించడం, మహిళా వ్యతిరేకం, మైనార్టీలు, దళిత వ్యతిరేక ప్రకటనలు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం పంపారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గాదిలింగనగౌడ, నాయకులు హుమాయూన్‌ఖాన్, మానయ్య, వెంకటేశ్‌హెగ్డె, ఎర్రిస్వామి, రఫీక్, కెరకోడప్ప, తలవార దుర్గప్ప, సంగనకల్ విజయకుమార్, గంగాధర, మీనల్లి వెంకటేశ్, లింగరాజు, ఇమామ్ గోడేకర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్లి, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రిగా వుంటున్న అమిత్‌షా పదవి నుంచి తొలగించాలని కురుగోడు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వీఎస్ శివశంకర్, గాలి బసవరాజు మాట్లాడుతూ సంవిధానాన్ని రచించిన బాబా అంబేద్కర్‌ను అవమానించి మాట్లాడటం తగదన్నారు. అలాంటి వ్యక్తిని కేంద్రంలో ఒక ఉన్నత స్థాయిలో వుండటం సరికాదన్నారు. దీంతో పాటు బెల్గామ్‌లో జరిగిన సమావేశంలో సీటీ రవి కూడా ఒక మహిళా మంత్రిని అవహేళన చేసి మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి వారు పదవుల్లో వున్నా వ్యర్థమన్నారు. వీరేష్, రామప్ప, నన్న గూళెప్ప, పక్కీరప్ప, శ్రీనివాస్, మంజునాథ్, కాలప్ప, తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో కమ్యూనిస్టు నాయకులు

## హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ ప్రారంభం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించే దిశలో భాగంగా హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అధికారులు తెలిపారు. శనివారం బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల చాంబర్, బళ్లారి చాంబర్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, జిల్లా పరిపాలన బళ్లారి, జిల్లాపంచాయతీ, బళ్లారి జిల్లాపారిశ్రామిక కేంద్రం, బళ్లారి నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమల మండలి హాల్లో శిక్షణను అధికారులు ప్రాణేశ్, యశ్వంత్రాజ్ నాగిరెడ్డి ప్రారంభించారు. మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్‌కీపింగ్, ఆఫీస్ అసోసియేట్ కోర్సులను ప్రారంభించామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు మంజునాథ, ఉపాధ్యక్షుడు దొడ్డనగౌడ, మల్లికార్జునగౌడ, సురేశ్‌బాబు వి.రామచంద్ర, రమేశ్, సబ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో దుర్గమ్మ గుడి అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులను నారా భరత్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య కారణంగా పనులు త్వరగా చేపట్టాలన్నారు. నగరవాసులు సహకరించాలని కోరారు.

## భారత సేవారత్న ప్రశంస ప్రదానం



అవార్డు అందుకుంటున్న వేదిక అధ్యక్షుడు గోవర్ధన్

బళ్లారిరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ పరిధిలోని కేకే హాళ్ గ్రామానికి చెందిన కర్ణాటక పదవిధార వేదిక రాజ్యా అధ్యక్షుడు గోవర్ధన్ భారత సేవారత్న ప్రశంస అందుకున్నారు. కరోనా సమయంలో పలువురికి దుస్తులు, ఆహారం సరఫరా చేయడంతో పాటు ఎందరినో ఆదుకున్న ఆయన్ని అక్షయ ప్రార్థన ఫౌండేషన్ గుర్తించి ప్రశంస ప్రదానం చేసింది. బెంగళూరు గాంధీ భవన్ సభా ప్రాంతంలో ప్రశంసా పత్రం అందించి సన్మానిస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలను ఆదుకుంటానని ఆయన తెలిపారు.

# హోసూరు జోన్

## డీఎంకే కార్యాలయం ప్రారంభం



మంత్రి నెహ్రూకు వెండిగదను బహూకరిస్తున్న అభిమానులు

హోసూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంల్లోని డీఎంకే కార్యాలయ ప్రారంభోత్సవంలో పార్టీ ప్రముఖులు, వివిధ రంగాల సాధకులు 50 మందికి బహుమతులు ప్రదానం చేశారు. ఏఎస్‌టీసీ హడ్కో ప్రాంతంలో పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం తమిళనాడు మున్సిపల్ పరిపాలనా వ్యవహారాలశాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ, ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణిలు హాజరయ్యారు. ఏఎస్‌టీసీ పాత గ్రంథాలయం ఎదురుగా పార్టీ జెండాను ఎగరవేసి డీఎంకే కార్యాలయాన్ని మంత్రులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.ప్రకాశ్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, మాజీ ఎమ్మెల్యే సెంగుట్టవన్, మురుగన్, జిల్లా కౌన్సిల్ చైర్మెన్ ఎ.యువరాజు, జిల్లా కోశాధికారి సుకుమారన్, పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ చైర్మెన్ చెన్నీరప్ప, జోనల్ చైర్మెన్ రవి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెందిల్‌కుమార్, గోపాలకృష్ణన్, మైనార్టీ డివిజన్ రాష్ట్ర ఉప కార్యదర్శి విజయకుమార్, ముఖ్య కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, మున్సిపల్ నిర్వాహకులు రవికుమార్, నిర్వాహకులు, సుమన్, కన్నన్, రాజా, శక్తివేల్, కలైసెల్వన్, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీకల్లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

రాయచూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్ నగర్ కాలనీలో కల్తీకల్లు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. గత కొంత కాలంగా ఈ కాలనీలోని ఒక ఇంట్లో పెద్ద ఎత్తున కల్తీకల్లు సిద్ధం చేసి విక్రయాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న అధికారులు ఆకస్మికంగా దాడి జరపడంతో పెద్దఎత్తున కల్తీకల్లుకు తయారీ చేసే వస్తువులు లభ్యమైయ్యాయి. వీటిలో 510 కేజీల సీహెచ్ పౌడర్, 284 కేజీల అల్ఫాజోలమ్‌య 96 గ్రాముల వైట్‌పేస్ట్ 454 గ్రాముల సిట్రిక్ ఆసిడ్ ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారం చేస్తున్న ఇద్దరు మహిళలు రేణమ్మ, ఈరమ్మ ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడైనా కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.



భూమిపూజలో మంత్రులు చక్రపాణి, నెహ్రూ, ఎమ్మెల్యే ప్రకాశ్, కలెక్టర్ సరయు తదితరులు

## అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.582.54 కోట్లతో చేపట్టే పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో రామనాయకన సరస్సు, ప్రభుత్వ పార్క్, కాంపెక్స్, భూగర్భ మురుగునీరు పారుదల వ్యవస్థ తదితర అభివృద్ధి పనులను మున్సిపల్ పాలనా వ్యవహారాలశాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ఆర్.చక్రపాణిలు తమిళనాడు తాగునీటి, డ్రైనేజీ బోర్డు డైరెక్టరు వి.దక్షిణామూర్తి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివరాజు, జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, ఎంపీ కె.గోపినాథ్, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సత్య, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వారాంతంలో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య

హోసూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. అయితే పూర్తిస్థాయిలో మౌలిక వసతుల సమస్య ఉంది. ప్రధాన రహదారిపై ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్నందున సర్వీస్‌రోడ్డుపై తరచూ ట్రాఫిక్‌జామ్ నెలకొంటోంది. కొన్ని చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా అవి సక్రమంగా పనిచేయకపోవడం మరో సమస్యగా మారింది. వారాంతమైతే చాలు నగరంలోని సర్వీస్‌రోడ్లపై ట్రాఫిక్ రద్దీ గంటల తరబడి ఉండడంతో ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమయం వృథా అవుతుండడంతో అనుకున్న గమ్యానికి సకాలంలో చేరలేకపోతున్నామని ప్రయాణీకులు వాపోతున్నారు.



సర్కిల్లో ఆగిపోయిన వాహనాలు